క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

కోస్గి రూరల్: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి బట్ట సంచులను వాడాలని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా శివాజీ చౌరస్తా నుంచి వివేకానంద చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే విష జ్వరాల బారి పడకుండా ఉండొచ్చన్నారు. తడి , పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి సిబ్బందికి అందించాలన్నారు. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ మొహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

సంఘాల నిర్వహణపై మహిళలకు శిక్షణ

మద్దూరు: గ్రామాల్లో మహిళా సంఘాల నిర్వహణ, సంస్థాగత నిర్మాణం, హక్కులు, విధులు, బాధ్యతలు తదితర అంశాలపై మహిళలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, డీఆర్‌డీఏ–ఐకేపీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 26 వరకు ఉమ్మడి మద్దూరు మండలంలోని 56 గ్రామ సంఘాల ప్రతినిధులకు మద్దూరు ఐకేపీ కార్యాలయంలో శిక్షణ ఇచ్చినట్లు ఐకేపీ ఏపీఎం నారాయణ గురువారం తెలిపారు. సీఆర్‌పీలు సరోజిని, సుజాతలు గ్రామ సంఘాల ముగ్గురు ప్రతినిధులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణలో మహిల సంఘాల్లో ఉన్న మహిళలకు ఆర్థికంగా ఎదగడానికి చేయాల్సి పనులు, సంఘాల నిర్వహణ, తదతర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది ఉమ్మడి మద్దూరు మండల గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి

మద్దూరు: దేశంలో రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్ 151 జయంతి వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మద్దూరులో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఛత్రపతి సాహు మహరాజ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కృష్ణ, గోపాల్‌గౌడ్, పల్లెర్ల కృష్ణ, పోన్నయ్య, సాయిలు, చిన్నయ్య, గోవిందు, లాలప్ప, శంకర్‌నాయక్, పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



కోస్గి : దేశ వ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యాదర్శి బల్‌రాం కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ మేనేజర్ అనిల్ కుమార్‌కు సమ్మెకు సంబంధించిన నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కనిస వేతనం రూ.26 వేలు అందజేయాలని, కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, 8 గంటల పని దినాన్ని కాపాడాలని పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యాక్రమంలో మున్సిపల్, మెప్మా సభ్యులు రాధ, పుష్పలత, శ్రీలత , కృష్ణవేణి, బాలేశ్వరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

దామరగిద్ద: ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందజేసిన కంది విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని విండో అధ్యక్షుడు ఈదప్ప, ఎంఏఓ మణిచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాల రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా గురువారం వంద శాతం రాయతీపై కంది విత్తనాలు అందజేశారు. పీఆర్‌జీ 176, ఎల్‌ఆర్‌జీ52, ఆర్‌జీ105 రకాల విత్తనాలను రైతులను అందజేసినట్లు తెలిపారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

మక్తల్: మక్తల్ మండలం పరిధిలోని గోలపల్లి ప్రాథమిక పాఠశాలకు ముంబాయికు చెందిన వ్యాపారవేత్త వెంకటేశ్ రూ.20 వేలు విలువ చేసే స్మార్ట్ టీవీని వితరణ చేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ దాతను అభినందించారు. అలాగే బడి ఈడు వయస్సుగల పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు.



ఆటోవాలా.. ఆకలి కేకలు



దామరగిద్ద సంతబజార్‌లో ప్రయాణికుల కోసం నిలిపిన ఆటోలు

- ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో తగ్గిన ఉపాధి
- ఫైనాన్స్‌లు కట్టలేని దుస్థితి
- అమలు కాని ఆర్థికసాయం హామీ



యానగుందిలో ప్రయాణికుల కోసం వేచిచూస్తున్న ఆటో డ్రైవర్లు

దామరగిద్ద: ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం ఆటో చోదకుల పాలిట శాపంగా మారింది. ఆటోల్లో అత్యధికంగా ప్రయాణించే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంతో మహిళలు, విద్యార్థినులు ఆటోలు ఎక్కకపోవడంతో వారి ఆదాయానికి గండి పడింది. ఉచిత ప్రయాణంతో ఆటోలో ప్రయాణించే వారి సంఖ్య భారీగా తగ్గడం, చాలీచాలని ఉపాధితో ఓ వైపు ఆటోలపై తెచ్చుకున్న ఫైనాన్స్ కట్టలేని దుస్థితిలో ఆటో డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. కేవలం పురుషులు మాత్రమే ఆటోలు ఎక్కుతుండడంతో చాలీచాలని డబ్బులతో ఆర్థికంగా చితికిపోతున్నారు. దీంతో మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఆటోలు నడుపుతూ జీవనం సాగించే వందలాది మంది ఆటోవాలాలు తమ కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకొస్తున్నారు. కేవలం ఆర్టీసీ బస్సు సౌకర్యం లేని గ్రామాల్లో ప్రధాన రహదారులా వరకు ఆటోలను ఆశ్రయిస్తుండడంతో కొంత మేర ఆదాయం వస్తుందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజుకు రూ.1000 వరకు ఆదాయం వచ్చేదని ప్రస్తుతం రూ.500 కూడా రావడం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామంటూ గతంలో హామీ ఇచ్చింది. ఈ హామీ ఇప్పటి వరకు అమలు కాలేదని దానిని వెంటనే అమలు చేసి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని కోరుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని ప్రధానంగా షటిల్ బస్సులు మాత్రమే తిరిగే విఠలాపూర్, గత్ప, యానుగుంది, కాన్‌కుర్తి, ఉడ్మల్‌గిద్ద, మొగుల్‌మడ్క, లోకూర్తి ఉల్లిగుండం, పిడెంపల్లి, కందెన్‌పల్లి వంటి మారుమూల గ్రామాల్లో ఆటోల పై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు ఉన్నాయి. ఉడ్మల్‌గిద్దలో 30 మంది ఆటోలను నడుపుతూ జీవనం సాగిస్తుండగా కాన్‌కుర్తిలో 20 మంది ఆటోలపై ఆధారపడి జీవిస్తున్నారు. గడిమున్కన్ పల్లిలో 20 మంది, దామరగిద్దలో 10 మంది, లోకూర్తి, నర్సాపూర్, మల్‌రెడ్డిపల్లి క్యాతన్‌పల్లి తదితర గ్రామాల్లోనే ప్రతి గ్రామానికి 10 నుంచి 15 మందికి ఆటోలే జీవనాధారం. వీరందరికి ఉపాధి తగ్గడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఆటో నిర్వాహకులను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సహకారం అందించాలని కోరుతున్నారు.

ఆదాయం సగానికి సగం తగ్గిపోయింది



నేను 10 ఏళ్లగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ఆర్టీసీ షటిల్ బస్సులు తిరుగుతున్నా కూడా ఉడ్మల్‌గిద్ద నుంచి దామరగిద్ద, నారాయణపేటకు రోజుకు మూడు నుంచి నాలుగు ట్రిప్‌లు తిరిగి రూ.1000 సంపాదించేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆదాయం సగానికి సగం తగ్గిపోయింది.

–నర్సింహా, ఆటో నిర్వాహకుడు, ఉడ్మల్‌గిద్ద

నెలకు రూ.10 వేలు ఫైనాన్స్ కట్టాలి



గత ఐదేళ్లగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాను. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినప్పటి నుంచి ఆటోల్లో ఎక్కేవారు తగ్గిపోయారు. ఆరు నెలల క్రితం రూ.4లక్షల ఫైనాన్స్‌తో ఆటో కొనుగోలు చేశాను. నెలకు రూ.10వేల చొప్పున ఫైనాన్స్ కట్టాలి. ప్రతి నెల కంతులు కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను.

–అరుణ్, ఆటోడ్రైవర్, పిడెంపల్లి

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఆటోల్లో ఎక్కేవారు తగ్గడంతో తమకు ఆదాయం లేకుండా పోయింది. గతంలో రోజుకు నాలుగు ట్రిప్‌లు తిరిగేవాళ్లం. ప్రస్తుతం పొద్దంత ఒకటి రెండు ట్రిప్‌లతో సరిపెట్టుకొని ఇంటికెళ్తున్నాం. నాలుగు రూ.లక్షల ఆటో ఫైనాన్స్ నెలకు రూ.10,350 చొప్పున 14 కంతులు కట్టాను. ఇంకా రూ.2.50 లక్షల అప్పు తీర్చాల్సి ఉంది. ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

– కందుకూరి హన్మంతు, ఆటోడ్రైవర్, ఉడ్మల్‌గిద్ద

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ముడుమాల్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటిన ఎస్‌ఐ నవీద్

కృష్ణా: విద్యార్థులు మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఎండీ నవీద్ సూచించారు.గురువారం మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో చెట్లు నాటారు. ప్రతి ఒక్కరు చెట్లను పెంచడం అలవాటుగా మార్చుకోవాలని కోరారు. చదువుకునే వయసులో విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు లోనయితే వారి జీవితాలు చెడిపోతాయన్నారు. విద్యార్థులు కేవలం తమ చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నిజాముద్దీన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్

విద్యార్థులకు అవగాహన

నారాయణపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సూపరిండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో నారాయణపేట ఎక్సైజ్ సిఐ అశోక్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

నారాయణపేట: మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే జీవితం నాశనం అవుతుందని లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ సంస్థ ఛైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకుంటే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తుకు ఒకసారి బానిసైతే తన జీవితంతో పాటు తల్లిదండ్రులను చీకట్లోకి నెట్టినవారవుతారని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ కుమార్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ లక్ష్మీపతి గౌడ్, నాగేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ భేటీ

నారాయణపేట: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను గురువారం మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, నారాయణపేట ఇన్‌చార్జి ఈఎస్ సుధాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా సుధాకర్ ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్పీని కలవగా శుభాకాంక్షలు తెలిపి అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని సూచించారు.



ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు పూలమొక్క అందజేస్తున్న సుధాకర్

డీవీకే ఆశయ సాధనకు కృషి చేద్దాం

నారాయణపేట: విప్లవోద్యమానికి డీవీకే ఆలోచనలు ఆచరనీయమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ అన్నారు. కామ్రేడ్ డీవీకే మూడో వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్మిక సంఘం స్థాపించి అనేక మంది నాయకులను విప్లవం వైపు నడిపించిన మహనేత డీవీకే అని ఆయన సేవలను కొనియాడారు. బీడీ కార్మికుల అభ్యున్నతికి వారి జీవన భృతి కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. డీవీకే ఆశయ సాధనకు అందరం కలిసి కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రాము, జిల్లా నాయకులు కాలేశ్వర్, యాదగిరి, కిరణ్, విజయలక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణ

రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాలి

మరికల్: యాసంగికి సంబంధించిన బోనస్ డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, మల్లేష్, నరహరిలు గురువారం సంయుక్త ప్రకటనలో కోరారు. స్థానిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం హడావిడిగా రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లుగా బోనస్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్న నేటికీ రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కాకపోవడంతో రైతులు బ్యాంకులు, అధికారులు చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. వెంటనే బోనస్ నిధులు విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మాగనూర్: ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు లబ్ధిదారులకు సూచించారు. కొత్తపల్లి గ్రామంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా గురువారం భూమిపూజ చేసి ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణం చేపడితే ప్రభుత్వం విడతల వారీగా నగదు జమచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శంకర్ అంజమ్మ, నాయకులు శంకర్, తాయప్ప పాల్గొన్నారు.

వృత్తి కళాకారులను ప్రోత్సహించాలి

నారాయణపేట: రాష్ట్రంలో ఈనెల 25 నుంచి 29 వరకు కొనసాగనున్న వస్తు ఉత్పత్తుల ప్రదర్శనశాలను కుమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల వృత్తి కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఐమాక్స్ పక్కన గల ఓపెన్ గ్రౌండ్‌లో ఈ ప్రదర్శన శాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ ప్రదర్శనశాలను సందర్శించి బీసీ వృత్తి కళాకారులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను కొనుగోలు చేసి, వృత్తి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

నారాయణపేట: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈఓ గోవిందరాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు దగ్గర నుంచి పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీలను అమ్ముకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వెంకటేష్, వైశాలి, కృష్ణ, నవ్య శ్రీ, శిరీష, దత్తు, దాసు, సంతోష్, సంజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కోస్గి రూరల్: ఆటో, రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యాదర్శి బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాదర్శి గోపాల్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యా లయం ముందు ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలన్నారు. డ్రైవర్‌లకు థర్డ్ పార్టీ ఇన్స్‌రెన్సూ ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అంతకుముందు శివాజీ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్, శివకుమార్, సలీం, జనార్దన్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

బాధ్యతాయుత సేవలతోనే గుర్తింపు



ఎంపీడీఓలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

మాగనూర్: ప్రభుత్వ ఉద్యోగులకు బాధ్యతాయుత సేవలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ తెలిపారు. మాగనూర్ ఎంపీడీఓ రహ్మతుద్దీన్ బదిలీ కావడంతో గురువారం ఆయనను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ఎంపీడీఓగా తాను 10 నెలలు పని చేశానని ఈ పది నెలల కాలంలో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. అలాగే తన విధులకు సహకరించిన ప్రతి ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు, తోటి ఉద్యోగులకు ధన్యావాదాలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులపై ఆరా

ధన్వాడ: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ధన్వాడ తహసీల్దార్ సింధుజాను ఆదేశించారు. గురువారం ఆయన ధన్వాడ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమెకు సూచించారు.



దరఖాస్తుల గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

నారాయణపేట: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తపస్ జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. తన కుమారుడు గురుచరణ్ రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం వివిధ పాఠశాలలకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి మొక్కల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహ, డీఎస్ఓ భాను ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాజాపూర్ పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు అందజేసిన షేర్ కృష్ణారెడ్డి

నిధులు విడుదల చేయండి



నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వ సలహదారుడు వేం నరేందర్ రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణికా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణపేట నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

నారాయణపేట: పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ధన్వాడ మండలం కంసాన్‌పల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను లిఖితపూర్వకంగా రాసి ఇస్తే వాటిని దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

దామరగిద్ద: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఓ నారాయణ ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని క్యాతన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టాఫ్ డయేరియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలుషిత ఆహారం, నీరు, పరిసరాల పరిశుభ్రత వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది డయేరియా, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. శుభ్రమైన ఆహారం, కాచి చల్లార్చిన గోరువెచ్చని నీరు తీసుకోవాలని సూచించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

మక్తల్: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో దాడి చేసి రెండు ఇసుక టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ భాగ్య లక్ష్మీరెడ్డి తెలిపారు. టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

మేడిశెట్టి అవార్డుల ప్రదానం



మరికల్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ జీహెచ్ఎం రాం ప్రకాష్ గుప్తా పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు మేడిశెట్టి అవార్డులను ప్రదానం చేశారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలాల్లో 500 మార్కులకు పైగా సాధించిన వారిలో ఒక్కొక్క పాఠశాలల్లో పది మంది విద్యార్థులకు వెండి పతకాలను అందజేసి ప్రోత్సాహించారు.

బీజేపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి

మక్తల్: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ చైర్మన్ శంఖరోళ్ల రవికుమార్ అన్నారు. గురువారం చిట్యాల గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, కొండయ్య, గందమోళ్ల ఆనంద్‌గౌడ్ పార్టీ సినియర్ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల తనిఖీ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ కాలేజీను డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.ఏ. రషీద్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో విద్యకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కాలేజీలోని డైనింగ్ హాల్, డార్మిటరీ, వంటగదిని పరిశీలించి వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అమరచింత మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు

అమరచింత: మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు పదోన్నతిపై అమరచింత కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు నూతన కమిషనర్‌కు మున్సిపాలిటీ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని నాగరాజు పేర్కొన్నారు.